# మానినీ చిత్తచోరుడు

రచయిత :

కవికొండల వెంకటరావు, బి.ఏ.,బి.యల్.

["జవ్వని ముఖంకేసి చూచినాడు. పరికొత్తజవ్వనం ఊకవిస్తూవుంది. మెళ్లో వల్లపూసన్నా లేదు. చేతుల్ని అంతకంటె ఏవీలేవు. కాళ్ళకు అసలే ఏవీలేవు. వొళ్ళే పిల్ల! పిల్లే వొళ్లు!"]

ఈగాధ ద్వాపరయుగంనాటిది. శ్రీకృష్ణ భగవానుణ్ణి గురించి వ్రాసింది. ఇందులో కొంతమట్టుకు ప్రేమ ద్యోతకం అవుతూవుంటుంది. కొంతమట్టుకు విరక్తి ద్యోతకం అవుతూవుంటుంది.

—ఋషులంతా స్త్రీలై భూలోకంలో సత్యభామాదులక్రిందనూ, గోపికలక్రిందనూ జన్మించి, శ్రీకృష్ణభగవానులవారితో అష్టైశ్వర్యాలూ, ఇష్టభోగాలూ అనుభవిస్తూ పిల్లాజెల్లాతో వ్రేపల్లెవాడలో వర్ధిల్లుతూవున్న సమయంలో శ్రీనారదమహర్షులు, వైకుంఠంలో వొంటిగా ఋషినామంతో వుండలేకపోతేనేం, శ్రీకృష్ణులవారి రసికత్వం గ్రహించాలనే కుతూహలంచేతనైతేనేం, తానూ వొకస్త్రీగా భూలోకంలో జన్మించి, సాక్షాన్నారాయణమూర్తియైన యదుయాదవకుంజరునిలో సంసారం సాగించాలని గట్టి కోరిక తనలో వృదయింపజేసికొన్నాడు.

మహర్షులకు కోరికపుట్టిందీ అంటే తీరింది అన్నమాటే !—

ఏలాగో వోలాగు భూలోకంలో స్త్రీగాపుట్టారు నారదులవారు. కాని భూలోకంలో జన్మించడంఅంటే జన్మతోనే పదవి అనేది ఒకటుంటుంది చూడండి! ఏ పదవి ఈ స్త్రీగా జన్మించిన నారదులవారు ఆక్రమించడం! అప్పటికప్పుడే రాధ, రాధ తరువాత రుక్మిణి, ఆమెతరువాత సత్యభామ ఇలాగ్గా అష్టమహిషులు, అరవై వేలగోపికలు కృష్ణునిచెట్టబట్టి, ఉట్లుకొట్టి పట్టుకొచ్చే వెన్నముద్దల దగ్గర్నుంచీ పాల్గొంటూ వున్నారు. ఈకొత్తగా జన్మించిన నారదస్త్రీకి తావెక్కడ? ఏలా తనను తెలుసుకుంటాడు శ్రీకృష్ణభగవానులు? ఏలా తనను అనుగ్రహిస్తాడు శ్రీపరమాత్మప్రభువులు?

అంచేత ఎక్కడా తావులేక 'నారదస్త్రీ' అనగా స్త్రీవేషమునవున్న నారదులవారన్నమాట—ఆమె యాదవపురంలో గట్టుకింద ఓ గంగరావిచెట్టుంటే ఆచెట్టుకింద మకాం పెట్టుకుని, అక్కడక్కడ పట్నమమ్మట తెల్లాఅడంతోనే జోలేసుకుని బిచ్చానిగ్గాను బయల్దేఱుతూ వుండేది. చేతిలో చితారుమోగించేది. చితారుపాటకుతోడు గాత్రంకూడా కలిపేది. గాత్రానికితోడు కాస్తోకూస్తో అభినయించేది. రాత్రిపవేళలకి ఆచెట్టుకిందకు చేరుకుని వొక్కర్తే కాలక్షేపంగా కాలంగడుపుతూవుండేది.

క్రమక్రమంగా వయసొచ్చింది. ఆడదానికి ఏంకావాలి వయసుంటే? అదే అందం! అదే అదృష్టం! పట్నంలో ఏక్కేగుమ్మం దిగే గుమ్మంగా ముష్టెత్తుకుంటూ శ్రీకృష్ణభగవానులవారికి ఆవయసప్పుడు ఓరోజున ఎదురైంది. ఎదురౌతూ పాడిందికదా! ఎవరో అనుకుంది!

"చెట్టు వేఱు నూపురం,
చెట్టుకొమ్మ గోపురం,
గట్టుకింద కాపురం,
గట్టుమీద నే పురం:—"

అని పాడింది.

శ్రీకృష్ణభగవానులకు ఆపాట అదేదో కొత్తపాటలాగు వినబడింది. జవ్వని ముఖం కేసి చూచినాడు. సరికొత్తజవ్వనం ఊకవ్విస్తావుంది! మెళ్లో నల్లపూసన్నా లేదు. చేతుల్ని అంతకంటే ఏమీ లేవు. కాళ్ళను అసలే ఏమీ లేవు. వొళ్లే పిల్ల! పిల్లే వొళ్లు!

అదో విశేషం. చేతిలో చితారువుంది. కంఠం వినసొంపుగా వుంది. చూచారు శ్రీకృష్ణపరమాత్మలవారు. చూచి కిమన్నాస్తి ఏమీ పలుకరించకుండానే తమదారిని వెళ్ళిపోయినారు.

ఆఘడియేప్రారంభం జవ్వనికి వియోగాంకురం మొలకెత్తడం. మాపటికి చెట్టుకిందకు చేరుకుంది. చెట్టుకింద శుభ్రంగా తుడిచేసింది. చలికి తన కాళ్లు తనజోలిబొంతలో కుక్కుకుని, పండుకుంది చెట్టుమొదలు తలాడగా చేసుకొని; కాస్తదూరంలో పైబడ్డ వేఱుంటే ఆవేఱు తన్నుతూ అదే తాళపులయగా, చెట్టుకొమ్మలకేసిచూస్తూ చితారుమోగించి పాడుతూంది:

"చెట్టు వేఱు నూపురం
చెట్టుకొమ్మ గోపురం
గట్టుకింద కాపురం
గట్టుమీద నే పురం."

అని—

సరిగ్గా ఆ వేళప్పుడు శ్రీకృష్ణభగవానులవారేంచేస్తూవున్నారూ అంటే రుక్మిణీదేవితో సొగటాలపాళీ ఆడుతూవున్నారు. ఆడుతూ ఆడుతూ ఆటఆపి ఆమెతో "ఇప్పుడేవస్తాను, వుండు" అన్నారు. రుక్మిణితో అలాచెప్పి వెళ్ళిపోతూవుండడం స్వామికి పరిపాటే. అది అప్పటికప్పుడే ఏలతూపదివేలపదకొండో పర్యాయమో అయివుంటుంది. అంచేత ఆమె భర్తను ఎక్కడికనిగాని ఎందుకనిగాని అడగలేదు.

* * *

నారదస్త్రీ పాడుతూపాడుతూ శ్రీకృష్ణభగవానులవారి అడుగుల సవ్వడి చీకట్లో విన్నదై పాట ఆపి 'ఎవరు మహానుభావులు?' అని పృచ్ఛించింది. 'నేను నారదమహర్షిని' అన్నారు స్వామివారు. "కారు! కారు! నారదమహర్షులు కారు. నారదమహర్షులే అవితే ఏది యీ చితారు మోగించిపాడండి' అంది జవ్వని.

స్వామి అపూర్వంగా సరిగ్గా నారదులవారెలా వాయించేవారో అలావాయించారు, ఆజవ్వనిచేతిలోనుంచి చితారందిపుచ్చుకుని.

జవ్వని ఆపాళంగా అంది "నాహృదయాన్ని కరిగించిన మగవాడింతవఱకూ వొకడూ లేడు దేవా! మీరుతక్క! మీ పేరు?" అనిఅడిగింది. "ఈమధ్యాహ్నం కలుసుకోలేమనం" అని అంటూ స్వామి తిరోహితులైనారు.

"ఆయన శ్రీకృష్ణభగవానులా?" అని జవ్వని మర్నాటినుంచీ తన్నుదాను ప్రశ్నించుకుంటూ భిక్షాటనమఱచి ఆచెట్టుక్రిందే మహాతపస్సుచేసిచేసి తరించింది.